# మెస్ కేవసేవ




నా కాలేజీ రోజుల్లో జరిగిన కథ ఇది.

హాస్టల్లో సీటు దొరకలేదు. టౌనులో రూం తీసుకోవాల్సి వచ్చింది. నా రూంలో నాతో బాటు ఇంకా ఇద్దరు.

అప్పట్లో మాకు భోజనం మహా గొప్పసమస్య. హోటళ్ల పరమ దరిద్రంగా వుండేవి. అవి మా జీర్ణకోశాలనూ మనీ పర్సులనూ పీడిస్తూ బాధిస్తూ వుండేవి.

స్వయంపాకం సాగించాలని చేసిన ప్రయత్నాలు బెడిసి కొట్టాయి. "మన చేతులారా మనమే చేదువిషాలు వొండుకు తినడంకన్నా - అదేదో ఆ హోటళ్లల్లోనే కతికితేపోలా-" అనిపించింది. చేతులు కాల్చుకోవడం మానుకొన్నాం. అన్యథా శరణం నాస్తి-హోటల్సేవ శరణం, మరి!

ఇలా వుండగా స్టూడెంట్సు యొక్క భోజన ఇబ్బందుల్ని తొలగించడానికి వూళ్ళో ఒక "మెస్" వెలసింది. దాని పేరు "బోడి మెస్సు!" ఓనరు ఇంటిపేరు బోడి. మెస్సుకూ అదేపేరు స్థిరపడి పోయింది!

హోటలు సాపాటుతో పోల్చి చూసుకొంటే బోడిమెస్సు భోజనం నయమే

అనిపించింది. అదీ మొదట కొన్ని రోజులే! ఆ తరువాత బోడి మెస్సు భోజనం కూడా మొహం మొత్తింది!

నా రూం మేట్లలో వొకడైన వీరభద్రా నికి వున్నట్టుండి వొకరోజు విపరీతమైన కడుపునొప్పి ఒచ్చింది. చాలా బాధపడి పోయాడతను. హాస్పిటల్ కి తీసుకెళ్ళా ల్సొచ్చింది. పాపం వీరభద్రం-చాలా టాబ్లెట్లూ కాప్స్యూల్సూ వాడాల్సొచ్చింది.

తేలిందేమిటంటే — అతను తిన్న అన్నంలో సున్నం మోతాదు ఎక్కు వయిందని!

అతన్తోబాటే బోడిమెస్సులో చేరిన నేను హడిలిపోయాను. మా తింపువా తారెత్తిపోయాడు.

తింపువా అంటే — నా ఇంకో రూమ్మేటు. అవును. పేరు వింతగానే అనిపిస్తుంది-'తింపువా'! అతను బర్మా దేశస్థుడూకాడు, జాపనీయుడూకాడు. చీనా, ఇటలీ, ఈజిప్టులకి చెందినవాడు అసలేకాడు.

తింపువా భారతీయుడే! మన తెలుగు వాడే!

తింపువా అసలు పేరేమిటో మేమం దరం మరిచిపోయాం. బహుశా అప్పటికే అతసూ మరిచిపోయుంటాడు.

చాలామంది మనుషులు బ్రతకడం కోసం భోంచేస్తారు. కొందరు మాత్రం తినడంకోసమే బ్రతుకుతున్నట్టు కనిపి స్తారు. ఈ రెండో కోవకి చెందిన వాళ్ళలో అగ్రగణ్యుడు-తింపువా.

తింపువా-అనగా-తిండికోసమే పుట్టిన వాడు!

వీరభద్రం కడుపునొప్పి చూపి గోడు గోడు మన్నాడు తింపువా. "అయ్ బాబోయ్! ఆ బోడిమెస్సు మన కొంప తీసేట్టుంది. వాడు పెట్టేదే అసలు రెండు చెంచాల చప్పిడికూడు.... అందులోనూ సున్నం గ్రట్టా కలుపుతున్నాడూ అంటే! ....భగవాన్:-మనకేది దారి?—నీసంగతి నాకు తెలీదుగురూ!-నాకేది దారి?....మళ్ళీ హోటల్ పాలవాల్సిందేనా?-బోడిమెస్సు వాడు రూపాయిన్నర తీసుకుని రెండు చెంచాలన్నం పెడితే—ఆ హోటలువాడు రెండుంబావలా తీసుకుని ఒకటిన్నర చెంచా అన్నం మాత్రం పెడతాడు! భగవాన్! ఏఁవిటి బాబూ నాకీ అగ్ని పరీక్ష!-నాకిక నిష్కృతే లేదా?...." అని వాపోయాడు.


అయితే ఆ తర్వాత నాలుగోరోజు రాత్రి ఎనిమిదిన్నరకి రెండు బుగ్గల్లోనూ రెండు మీఠా కిళ్ళీలు దట్టించి "మనసా యెటులో-" అంటూ కూనిరాగం తీస్తూ గదిలోకి ప్రవేశించి నన్నాశ్చర్య సాగ రంలో ముంచేశాడు తింపువా.

"—ఏఁవిటోయ్! ఏఁవిటి-మరీ అంత ఖుషీగా వున్నావ్? ..ఏఁవిటి సంగతీ? ...." అన్నాన్నేను. ప్యాకెట్టులోంచి ఓ సిగిరెట్టుతీసి వెలిగించుకుంటూ.

నా క్యూరియాసిటీ చూసి చిదానందంగా నవ్వి, తనూ సిగిరెట్టు ముట్టించి, రెండు బుగ్గల రెండు కిళ్ళీలూ కసాపిసా నవిఁలి, సిగిరెట్టుపొగ గుప్పున ఒదిలి—"తీరి పోయింది—" అన్నాడు తింపువా.

"ఏఁవిటి తీరిపోయింది?...."

"ప్రోబ్లెమోయ్ ప్రోబ్లెం! మనల్ని బాధించి వేధించిన భోజన సమస్య ఇవ్వాళ్టితో తీరిపోయింది—" అంటూ




భోగట్టా అంతా ఇలా చెప్పాడు వాడు— "ఆహా....యేం భోజనంవేం భోజనం.... జెన్మలో నేనలాంటి విందు ఆరగించ లేదు. ఆ మెస్సుముందు ఇంటి భోజనం యెందుకోయ్!....ఓహ్....! యెంతన్నం పెట్టేడు వాడు! అడక్కుండే వొడ్డించాడు. చెంబెడు సాంబారోయ్.... సాంబారు చెంబెడు పోశాడు....ఇహ రసం సరేసరి-సాక్షాత్తూ అమృతం— రెండప్పడాలూ రెండు తాళింపులూ చిప్సూ మిరపకాయబజ్జీలూ....నేనే తినలేక చచ్చాననుకో....భోజనం అంటే అదీ భోజనం....ఆ బోడిమెస్సు వాడూ పెట్టాడు....ఏం పెట్టాడు? వాడు పెట్టే మూడు భోజనాలైనా మనకొక పేగుకే సరిపోదు...."

"ఎక్కడో కొత్త మెస్సు పెట్టారన్న మాట....మెస్సు పేరేవిటింతకీ?...."

"పేరా? పేరింకా ఏవీ పెట్టలేదు. పెట్టరేవో కూడా! అయినా....అక్కడ వొడ్డించే గరిటలున్నాయి చూడూ— హబ్బా-ఎంతెంత పెద్దవనుకున్నావు.... ఆ గరిటలోకల్లా పెద్దెట్టు గరిటతో ఆ మెస్సోనరు అన్నం వొడ్డిస్తూంటే సాక్షాత్తూ అన్నపూర్ణే వొచ్చి వొడ్డిస్తూన్నట్టు అనిపించింది. వేరే పేరెందుకూ? ....ఆ మెస్సు నసలు 'గరిట మెస్సు' అనే పిలవొచ్చు ఆహా!....ఎంత పెద్ద గరిటలూ....ఏం గరిటలూ...."

ఆమాట తింపువా ఏ ముహూర్తాన అన్నాడో తెలియదు. రెండో నాటికల్లా ఈ కొత్త మెస్సుకి 'గరిట మెస్సు' అనే పేరు బాగా ప్రచారంలోకి ఒచ్చింది. ఆపేరే స్థిరపడిపోయింది.

గరిట మెస్సు గురించి పూరించి పూరించి చాలా చెప్పాడు తింపువా. నన్ను చాలా బలవంతం చేశాడు. సరేనని నేనూ గరిటమెస్సులో చేరాను.

నిజమే! అక్కడివన్నీ గొప్పగొప్ప గరిటలు!

అక్కడ వడ్డనకూడా చకచకా జరిగి పోతుంది.

ఆడకింగ్‌కాంగ్‌లా వుండే ఒకావిడ (ఈవిణ్ణే 'అన్నపూర్ణ'గా వర్ణించాడు తింపువా!) మొదటగా రంగంలోకి ప్రవేశించి ఏనుగు చెవంత గరిటతో ఆకుల్లో వరసగా అన్నం దిమ్మరిస్తూపోతుంది. ఆ తరువాత ఇద్దరు వస్తాదుల్లాంటి ఆసామీలు ఒక పెద్ద గంగాళాన్ని మోసుకుంటూ వొస్తారు. అందులో సాంబారుంటుంది. ఒకటిన్నర శేరంత గరిటతో మూడో ఆయన ఆ గంగాళంలోంచి సాంబారు తోడి విస్తరాకుల్లో పోస్తూ వెళ్తాడు. అంతలో వో కుర్రాడు వో బుట్టతో ప్రవేశించి అటో అప్పడం ఇటో అప్పడం పారేస్తూ వెళ్ళిపోతాడు... ఇంతలో ఆడ కింగ్‌కాంగ్ పునః ప్రవేశించి వూరగాయా, తాళింపులూ విస్తర్లలో విదిలిస్తూ పోతుంది.

గరిట మెస్సు వడ్డన నిజంగా గొప్ప వడ్డన!

గరిట మెస్సులో శుచీశుభ్రతల గురించి మాత్రం మనం ఏమీ శంకించనవసరం లేదు! ఒకవేపు భోజనాలు జరుగుతూండగానే వీధిలో అప్పుడే దిగిన బండినుంచి వంటచెఱకు మనమధ్య నుంచే లోపలికి చేరవేయబడుతుంది. ఒకసారి ఒక కట్టె జారి భోంచేస్తూన్న వో కుర్రాడి తలని అతిప్రేమగా పరామర్శించితే పరామర్శించింది గాక; మెస్సోనరు (ఆడకింగ్‌కాంగ్) ఎంతో వాత్సల్యంతో ఆ తర్వాత ఆ దెబ్బకి కట్టుకట్టి పంపించిందిగదా! వంట చెరకే కాదు వంటకని బొగ్గుల మూటలు కూడా అప్పుడప్పుడూ భోజనాల బంతుల మధ్యనుంచే లోపలికి చేరవేయబడతాయి. ఆ నుసి కాస్తోకూస్తో విస్తర్లలో పడినా, అందుగురించి ఎక్కువమంది పట్టించుకోరు. పట్టించుకున్నవారు కూడా దాన్నో చక్కటి నంజుడు పదార్థంగా భావించి గుట్టు చప్పుడు కాకుండా అన్నంలో కలుపుకుని మింగేస్తారు. బొగ్గుల నుసేగాక అప్పుడప్పుడూ బొగ్గులు కూడా రాలిపడడం కద్దు. కొంతమందికవి నయిస్తాయి. కొంతమందికి సయించవు. సయించిన వాళ్ళు వాటిని తింటారు. సరిపడని వాళ్ళు— ఇష్టంలేని కూరని అవతలికి నెట్టేసినట్టు ఒక వారకి నెట్టేస్తారు.


ఓహ్! గరిట మెస్సు భోజనమూ, ఆ వడ్డనా, ఆ వాతావరణం—అంతా వర్ణనాతీతం!

"గరిట మెస్సును వదిలిపెట్టనుగాక వదిలిపెట్టను—" అన్నాడు తింపువా.

నాకు మాత్రం అంత తెగింపు లేకపోయింది. "ఏ మెస్సులోనైనా సరే— కమ్మగానూ కడుపు నిండుగానూ తినగలననే పేరాశ ఎటూలేదు-నా బోడిమెస్సే నాకు చాలు...." అనుకుని బోడిమెస్సులో ఆ చంచాల అన్నమే తింటూ ఒచ్చాను.

రుచీపచీ లేని చప్పిడి కూడు గొంతులోకి దిగలేక దిగలేక దిగుతున్నట్టు రోజులలా వెళ్తూండగా—ఉఃళ్ళో ఒక కొత్త మెస్సు వెలసింది. దానిపేరు "రత్నం మెస్సు."

మెస్సొకటి కొత్తగా వెలసిందీ అంటే నా మటుకు నేను వులిక్కిపడనూలేదు, లొట్టలేసుకుంటూ వెళ్ళి అందులో జేరిపోనూలేదు. పాతైనా కొత్తయినా మెస్సుల్లో




సాపాటు అంతా ఒకే మోస్తరు-అంతో యింతో కమ్మగా వుండేచోట కడుపు నిండదు. కడుపునిండా పెట్టేచోట శుచీ శుభ్రతా వుండవు.

కొత్తగా నెలకొల్పబడిన రత్నం మెస్సు గురించి పెద్దగా ప్రచారం ఏదీ జరిగినట్టు కనిపించలేదు. కాని, వోపెన్ చేసిన నెలన్నర రోజులకే — వూళ్ళో మిగతా మెస్సుల రద్దీ రానురానూ క్షీణిస్తున్నట్టు కనపడ్డది. గరిటమెస్సు సంగతి నాకు తెలీదు గాని, మా బోడిమెస్సు మాత్రం కేవలం పన్నెండుమంది భోక్తలతో కళావిహీనంగా, మరీ 'బోడి'గా తయారయింది.

కలియుగంలో పాపభీతిలా చిక్కిపోతూ ఒచ్చిన బోడిమెస్సు కష్టమర్సుని చూసి నేను చాలా ఖేదించాను. పోనీ, గరిటమెస్సు పరిస్థితయినా కొంచెం మెరుగ్గా వుందేమోనని మా తింపువాని ఆ విషయం గురించి అడిగేను.

"గరిటమెస్సా?...." అన్నాడు వాడు.

"అవునోయ్....పాపం ...ఇప్పుడెల్లా వుంది?....మునుపొహబంతి భోంచేస్తూ వుంటే మర్రెండు బంతుల జనం కాచుకుని నిలబడేవారు కదా....ఇప్పుడు ఆ రష్షంతా అలాగే ఒస్తున్నారా?...."

గుంభనంగా నవ్వేడు తింపువా. "గరిట మెస్సు ప్రస్తావనే నా దగ్గర తీసుకు రావొద్దోయ్! ఏంటల్లా చూస్తావ్? .... నిజమే! .... ఒకప్పుడు నేనా మెస్సుకి కేన్వాస్ చేసేను....చాలామంది నందులో జేర్పించేను ... కాని ... నువ్వేమైనా అనుకో భాయ్ ...రత్నం మెస్సు ముందు గరిటమెస్సనగా ఎంత? ..."

"తింపువా!..."అన్నాను వులిక్కిపడి.

"అవునోయ్ నీతో ఎప్పటికప్పుడు చెప్పాలనుకునే చెప్పడం వాయిదా వేస్తూ వచ్చేను .... ఎంచేతంటే .... నీకు నా

మాటల్లో నమ్మకం వుండదు....ఇప్పు డైనా—నీకు ఒక ట్రయల్ వెయ్యా లనుంటే .... రత్నం మెస్సులో జేరి చూడు....యు విల్ లైకిట్...."

"మరి—నువ్వు...."

"మంచి భోజనానికి మనమెప్పుడూ ముందే వుంటాం భాయ్ ... రత్నం మెస్సులో నేను జేరి ఇరవై రోజులు పైనే కావొస్తోంది...."

అలా తింపువాతోబాటు నేనూ రత్నం మెస్సులో జేరేను.

వండ్రఫుల్!

రత్నం మెస్సు వాతావరణమూ అక్కడి భోజనమూ అక్కడి వడ్డనా—అంతా చూసిన నాకు అనిపించేదేమంటే—

రత్నం మెస్సు మెస్సుకాదు, రత్నం మెస్సుభోజనం మెస్సుభోజనం కాదు!

అవును మరి—మూడు భోజనాల గదులున్న ఆ మెస్సు ముచ్చటైన సంసా రపుటిల్లులావుంది. గుమ్మాలకి పసుపూ కుంకుమా రాసివున్నాయి. కిటికీలకి చక్కటి (చవకబారువి కానేకావు) తెరలు వేళ్ళాడుతున్నాయి. గోడలకి మంచి మంచి ప్రకృతి దృశ్యాలు (బూతు బొమ్మలు కానేకావు సుమా!) తగిలింప బడివున్నాయి. అక్కడి ఫర్నిచర్—టేబుళ్ళూ కుర్చీలూ-కూడా పొందికగా సౌకర్యంగా వున్నాయి. వేడన్నం తింటూ వుక్కపోసి వుక్కిరి బిక్కిరవకుండా సీలింగ్ ఫాన్లున్నాయి.

మెస్ వోనర్ రత్నం స్వంతమనిషిలా వడ్డిస్తూ వుంటాడు. అతన్తోబాటు వంట వాడు కాటోలు — మరొహాడు వడ్డనలో అతనికి సాయపడుతూంటాడు. గడబిడ వుండదు. హడావుడీవుండదు. "తొందరగా నాలుగు మెతుకులు కతికి వేగిరం భోజనం అయిందనిపిస్తే చాలాబాబూ!...." అని అనిపించనే అనిపించదు. వంటకాలన్నీ రుచిగానూ శుచిగానూ వుంటాయి. నా ఫేవరెట్ డిష్ అయిన గుత్తొంకాయకూర రత్నం మెస్‌లో బ్రహ్మాండంగా వొండు తారు. బస్.

రత్నం మెస్‌ని వొదలకూడదని నిశ్చ యించుకున్నాన్నేను.

హఠాత్తుగా వొకరోజు టాంటాం గాడు నన్ను నడివీధిలో నిలవేసి "ఏం గురూ?... నువ్వుకూడా ఆ లేచిపోయిన మెస్సులో జేరిపోయేవటగా? .." అని అడిగినప్పుడు నేను ఆశ్చర్యపోయి తిక మకపడి నిర్ఘాంతపోయేను.

టాంటాంగాడి అసలు పేరు మా కెప్పుడూ గుర్తుండదు. టమటమా అనీ టముకుటముకనీ పి.ఎస్.సీ. (సిటీ న్యూస్ కరెస్పాండెంట్) అనీ—ఇట్లాంటివే వాడి నామాంతరాలు. ఎప్పుడోగాని ఎక్కడో గాని హఠాత్తుగా గాని కనిపించడు టాంటాంగాడు. నాల్రోజులపాటు నలుగు రికి వరసగా వాడు కనిపించేడూ అంటే వూళ్ళో ఏదో చెప్పుకోదగ్గ విశేషమే జరి గిందన్నమాట.

"అదేంటి అలా తెల్లబోతావేఁవిటి?-" అన్నాడు టాంటాం.

'లేచిపోయిన మెస్సు'—అన్న విశే షణం గురించి ఆలోచిస్తున్నాన్నేను. ఆ ముక్కే వాడితోటీ అన్నాను.

పెళపెళా నవ్వి — "అమాయకత్వం నటించడం నీకు చాతకాదు భాయ్—లేచి పోయిన మెస్సంటే రత్నం మెస్సేనని

నీకు తెలుసని నాకు తెలీదనుకున్నావా?...."

రత్నం మెస్సు—లేచిపోయిన మెస్సు!

—ఏఁవిటీ గందరగోళం?

"నిజంగా టాంటాం—నువ్వు చెబుతున్నదేవిఁటో నాకు వొక్క ముక్కా అర్థం గావడం లేదు—" అన్న తర్వాత, నాచేత కొన్ని ప్రామిస్సులుకూడా తీసుకుని నాకు నిజంగానే భోగట్టా తెలీదని నమ్మేక తెలీనందుకు గరిటమెస్సులో రైసుగరిటెడు ఆశ్చర్యం ఆశ్చర్యపోయి—"నువ్వొట్టి సింపుల్ మైండెడ్ ఫెలోవి గురూ—" అంటూ విషయం అంతా వివరించి చెప్పేడు టాంటాం.

రత్నం మెస్సులో వొక ఆడమని షుంది. పేరు నీరజ.

నీరజ రత్నం భార్య కాదు. ఇంకొకరి భార్య. ఆ ఇంకొకరి వూరు హైదరాబాదో సికిందరాబాదో ఖచ్చితంగా తెలీదు. పెద్ద హోదా ఆ స్తీ అంతస్తూ వుండేవిట అతనికి.

నీరజ భర్త ముసలివాడని వొక వదంతి. ఈవిడ ఆయనకి రెండో భార్యో మూడోభార్యో అయివుండాలని వూహ. వాళ్ళింట్లో రత్నం కార్ డ్రైవర్‌గా వుండే వాడట. ఎలా కుదిరిందో ఏమోగాని-రత్నానికీ నీరజకూమంచిసఖ్యత ఏర్పడింది.అది ప్రణయంగా పరిణమించింది. వొకానొక శుభముహూర్తాన (రత్నానికి అది శుభ ముహూర్తం.నీరజభర్తకి దుర్ముహూర్తం) బోలెడన్ని నగలతో నీరజ రత్నంతో లేచొచ్చేసింది. ఈ వూళ్ళో ఇద్దరూ కలిసి ఈ మెస్సు బిజినెస్సులోకి దిగేరు.

నీరజ చాలా అతదగత్తెట.

సినిమా స్టార్లా?—ఎందుకూ—నీరజ ముందు దిష్టితియ్యటానిక్కూడా పనికిరారుట. నీరజ సౌందర్యం నిజంగా అతిలోక సౌందర్యంట. అయితే, అవిదెప్పుడుగానీ ఇల్లొదిలి—అదే — మెస్సొదిలి—వీధిని నడవగా చూసినవాళ్ళు చాలా తక్కువ మందిట. కాని, ఆతక్కువమందికూడా ఆమె యొక్క భువనమోహన రూప వైభవంచేత సమ్మోహితులై పోయేరుట. వారిలో కొందరు మరీ ప్రేమోన్మత్తులై వొక్కసారైనా ఆమె పొందు ననుభవించాలని నానా విధాలా ప్రయత్నాలు కొనసాగిస్తున్నారట. బైటపడి చెప్పుకోవడం లేదుగాని—రత్నం మెస్సులో భోంచేసే ప్రతివారిలోనూ ఆ కోరిక ఏదో వొక స్థాయిలో వుండనే వుందట....

—అదీ టాంటాం గాడు చెప్పిన వృత్తాంతం.

"పొగిడేస్తున్నాననుకోకు గాని-నువ్వు చాలా బుద్ధిమంతుడివి గురూ! ఇన్నాళ్ళయి రత్నం మెస్సులో భోంచేస్తూ అది లేచిపోయిన మెస్సనే నీకు తెలీదంటే—నాకు 'వండర్‌మేథండర్'గా వుంది .... మాట జెప్తాను—వినుకో—యేం లేదు—యీ పెయిర్ సెక్సుంది జూశావూ....వాళ్ళ పోకిళ్ళన్నీ అదో పిచ్చిధోరణి ...అతి మంచి అబ్బాయిలంటే వాళ్ళకో వీక్నెసు-ఏదో కళలో వుండి నీరజ నీమీదకూడా వో కటాక్షవీక్షణం ప్రసాదించవొచ్చు—దగ్గరివాడివిగాబట్టి చెప్తున్నా—నువ్వు నీ ఎవ్రెడీలో వుండాలి...."

టాంటాం చెప్పిన భోగట్టా నన్ను చాలా కలవరపరచిన మాట వాస్తవమే. రత్నంగురించీ నీరజగురించీ-పాపం—నీరజ భర్తగురించీ—ఎన్నెన్నో వూహలొచ్చాయి.

అంతకాలమూ నమ్మకంగా తనతో కాపురంచేస్తూ ఒచ్చిన స్త్రీ-హఠాత్తుగా ఓ తెల్లవారుఝామున చూసుకుంటే— ఇంట్లోంచి మాయమైపోయినట్టు తెలిస్తే-పాపం-పరువుగా బ్రతికే మగవాడి మనః స్థితి ఎంత హృదయవిదారకంగా వుంటుంది?

దేన్నయినా సహించి భరించవచ్చునేమోగాని-భార్యవల్ల జరిగే ఇట్లాంటి తలవంపుల్ని భరించడానికి ఎంత గుండె నిబ్బరం కావాలి?

నీరజ భర్తగురించి ఆలోచించేకొద్దీ నా మనసు వికలమైపోయింది. మానవత్వం మీదే విశ్వాసం సడలిపోజొచ్చింది. అయితే—

ఇదంతా అనవసరమైన ఆలోచనల వల్ల వచ్చే మనసు జబ్బేగాని. రత్నం వ్యక్తిగత జీవితంగురించీ అతని భార్య అతని భార్య కాకపోవడం గురించీ— నేనెందుకు బుర్రబద్దలు చేసుకోవాలి?

రత్నం మెస్సులో భోజనం బాగుంటుంది. నాకు నచ్చుతుంది. అంతే! మిగతా విషయాలు నాకు అనవసరం—

రత్నం మెస్సుకి నేను మామూలుగానే వెళ్తున్నాను. అయితే—టాంటాం నుంచి భోగట్టా విన్న తర్వాత—మెస్ వాతావరణాన్నీ అక్కడికి భోజనానికి ఒచ్చే ఇతరుల ప్రవర్తననీ ఇంతకు ముందుకంటే జాగ్రత్తగా పరిశీలించడం మొదలెట్టేను.

నిజమే! భోజనాలు చేసే అందరి దృష్టీ భోజనాలమీదేలేదు. అప్పుడప్పుడూ లోపలి గదివేపు కొన్ని వాలు చూపులు. కొందరి మధ్య ఏవో గుసగుసలు. సన్నటి నవ్వులు, కనుగీటులు.

లోపలి గదిలోంచి అప్పుడప్పుడూ సన్నటి అస్పష్టమైన స్త్రీ స్వరం. చేతి గాజుల గలగల. చీరమడతల చిరు సవ్వడి. రత్నాన్ని లోపలికి పిలవడానికి సంకేతం-పొడిదగ్గు

"మీరీ మధ్య సరిగ్గా భోంచెయ్యడం లేదుసార్!-ఒంట్లో బాగుండడం లేదా?-" అన్నాడొక రోజు రత్నం.

నా పరాకుని అతను రుగ్మతగా భావించేడు.

"అబ్బే — అదేంలేదు—" అని ప్రయత్నంమీద నవ్వేను.

"రాత్రికి మాత్రం-పెందరాళే-మొదటి బంతికే ఒచ్చెయ్యండి సార్.... మీ కిష్టమైన కూర-గుత్తొంకాయ...."

గుత్తొంకాయ కూర నా కిష్టమని ఎప్పుడు కనిపెట్టేడో రత్నం!

టాంటాం గాడన్నట్టు—నాలో ఏదో మంచితనం పైవాళ్ళకి కనిపిస్తుంది కాబోలు-నాకు తెలీకపోయినా.

రాను రాను రత్నానికి నేను కొంచెం దగ్గిరవాణ్ని అయ్యేను. మెస్ వ్యవహారాల గురించి అతన్తో అప్పుడప్పుడూ పిచ్చాపాటీ మాట్లాడుతూ వుండేవాణ్ని.

రత్నానికి పెద్ద ఆలోచనలున్నాయి. మెస్ ఇలాగే మరో సంవత్సరం పాటైనా సజావుగా జరిగితే-ఒక మంచి హోటల్ ప్రారంభించి-దాన్ని బాగా అభివృద్ధిచేసి-అలాగే స్థిరపడిపోవాలని అతని సంకల్పం.

"నీకేం రత్నం-నువ్వు మెస్సు తెరిచేక మేమంతా అంతో ఇంతో శుచిగా శుభ్రతగా తినగలుగుతున్నాం-నీ మెస్సు

స్టాండర్డుని నువ్విలాగే నిలబెట్టుకుంటే-సంవత్సరం వేం ఖర్మ? — ఆర్నెల్లకల్లా నువ్వో ఫస్ట్‌క్లాస్ హోటల్ మంచిసెంటర్లో ఓపెన్ చెయ్యొచ్చు—" అన్నాన్నేను.

"ఏదోసార్-అంతా మీలాంటి వాళ్ళ చేతి చలవ—" అన్నాడు రత్నం.

రత్నంతో నేను ఎంతో కొంత సన్నిహితంగా మాట్లాడుతున్నాను. టాంటాం మాటల్ని మరిచిపోదామన్నా మరిచిపోలేకుండా వున్నాను. నీరజ ఎలా వుంటుందో చూడాలన్నకోరిక నానాటికీ బలవత్తర మవసాగింది. ఆ కోరికని నా బుద్ధిమంతనం ఎంతగా జోకొట్టినా—వూఁ—మళ్ళీ తలెత్తుతోంది.

అయితే—ఒకసారి ఆ అవకాశం రానే వచ్చింది.

ప్రిపరేషన్ హాలిడేస్ రావడంవల్ల స్టూడెంట్స్ చాలామంది వూళ్ళకి వెళ్ళిపోయేరు. మెస్సుకి కొద్దిమందే వస్తున్నారు. ఆ కొద్దిమంది కోసమూ—మెస్ నడుపుతానేగాని ముయ్యనన్నాడు రత్నం.

ఒకరోజు మధ్యాహ్నం లైబ్రరీనుంచి మెస్సు కొచ్చేసరికి బాగా వేళ దాటింది. మెస్సంతా ఖాళీ. భోజనం అయిపోయిందేమో అనుకున్నాను. డైనింగ్ రూంలో తటపటాయిస్తూ నిల్చున్నాను.

"ఆయన బజారు వెళ్ళేరు—చేతులు కడుక్కురండి ..." అని లోపలినుంచి స్త్రీ స్వరం వినిపించింది!

ఆవేళ భోజనానికి నాకు నీరజ ఎంతో లేత అరిటాకు పరిచింది. కాని, ఎంత లేత అరిటాకైనా ఉండలేనంత కోమలంగా ఉంది నీరజ.

ఆమె శరీరమంతా లావణ్యం.

శబ్దార్థాల వెనుక ప్రతిధ్వనిస్తుందట-గొప్ప కవిత్వం. నీరజ సౌందర్యమూ అట్లాంటిదే-వయసుకూ తనువుకూ అతీతమైనది!

నీరజను పరిశీలనగా చూస్తూ అలా భోంచెయ్యడం నాకు లజ్జ అనిపించింది. "మీ కిష్టమైన పుదినపచ్చడి—ముట్టుకోనే లేదేం? ." అంది నీరజ. నా ఇష్టాలేవో రత్నం నీరజా కలిసి చర్చించుకున్నారా అనిపించింది.

నీరజ కళ్ళలో ఎంతో దయుంది. ఆ చూపులో ఏదో వేదన-దూరమైపోతున్న ఓడలో వున్న ఎవరో ఆప్తులకి వీడ్కోలు ఇస్తున్నట్టు.

భోజనం ముగిసేసరికి రత్నం రానే వచ్చేడు. రెండు బస్తాల బియ్యమూ బొగ్గులమూట ఒకటీ లోపల దింపించేడు. "బియ్యం మూటకీ బొగ్గుల మూటకీ ధరలో ఏమీ తేడా లేకపోతోందిసార్ రానురానూ ..ఒద్దురాబాబూ ఈ మెస్సు బిజినెస్సు—అనిపిస్తుందొక్కో సారి...."

అంటూ బలహీనంగా నవ్వేడు.

ఆ తరువాత రత్నంతో ఆమాటా ఈమాటా మాట్లాడి రూము కొచ్చేసేను.

నీరజని ప్రత్యక్షంగా చూసేక, ఆమెతో మాట్లాడేక-నాలో ఏదో గొప్ప ఆందోళన గాలిదుమారంలా రేగింది. అంత అద్భుత సౌందర్యరాశి, సౌజన్యవతి — ఇల్లూ డబ్బూ హోదా అన్నీ ఒదిలేసి రత్నం లాంటి ఒక సామాన్యుడితో ఎందుకు లేచిరావాలి? రత్నంలో ఏంచూసి? రత్నంతోబాటు గడిపే ఈ ప్రయోగాత్మక జీవితంలో ఏ గ్లామర్, ఏ థ్రిల్ వుంటుందనుకుని?—ఎందుకంత తెగింపు? ఆ

సాహసం?—కట్టుకున్న భర్త బ్రతుకు అవమానాల పాలుచేసి . . అతణ్ణి సంఘం దృష్టిలో ఒక అసమర్థుడిగా వాజమ్మగా భార్యని అదుపులో పెట్టుకోలేని నిర్వీర్యు డిగా నిరూపించి—

ఎందుకంత పనిచేసింది నీరజ?

నన్ను పీడించి బాధించి వేధించి ఉన్మత్తుడ్ని చేస్తూ వొచ్చిన ఆ ప్రశ్నకి హఠాత్తుగా వొకరోజు సమాధానం లభించింది. కాని, ఆ సమాధానంకూడా నాకు ఉపశాంతిని ప్రసాదించడానికి బదులు మరింత అశాంతిలో పడేసింది—

ఆరోజు—

* * *

అవును బాగా గుర్తుంది. కాలేజీలో క్లాసులు ఎడాపెడా జరుగుతున్నాయి. అర్జెంటుగా వొచ్చిపోవలసిందంటూ ఇంటి నుంచి ఉత్తరం భోజనానికి రాబోవడం లేదని చెప్పడంకోసం రత్నం మెస్‌కు ఆరోజు వెళ్లాను.

మూడున్నరై ఉంటుంది.

మెస్ అంతా నిర్మానుష్యంగా వుంది. తలుపు చేరవేసివుంది. "రత్నం—"అని పిలుద్దామనుకుని, దానికి మారుగా తలుపు తట్టబోయి—ఎత్తినచేయి ఆపేసేను—

లోపలినుంచి స్త్రీ స్వరం—సన్నగా—ఏడుపులో మాటలు—మాటల్లో ఏడుపు-నీరజ గొంతే అది ..."మీకేం మొగవాళ్లు ఏదొచ్చినా నాకేగా....వీధంట వెళ్లాలంటే తలకొట్టేసినట్టుంటుంది....అబ్బ....ఎంత అసహ్యంగా చూస్తారు .... ఏం—ఈ బ్రతుకు బ్రతక్కపోతేనేం...."

"నీరూ....మరేం ఇదవకు ...యింకో ఆరునెల్లు . .పోనీ....ఐదునెల్లు — వోపిక పట్టు ...విజయవాడెళ్ళిపోదాం—లేదా—గుంటూరో—తిరపతో—బందరో వెళ్ళిపోదాం ...హాయిగా దర్జాగా హోటల్ పెట్టుకుందాం ..మన సంగతి అక్కడెవరికీ తెలియదు ...అంతవరకూ . "

"అంతవరకూ మాత్రం .. ఇంతే.... వ్యాపారం ..డబ్బు డబ్బు . వ్యాపారం ఇంతే.. .మీ వ్యాపారం కోసం మెస్సుకి నలుగురూ రావడంకోసం . .నేను లేచిపోయొచ్చి మీతో వున్నానని చెప్పుకోవాలి. అగ్నిసాక్షిగా పెళ్లాడిన మనం.... ఇలా పదిమందిలో ...వూఁహూ ... లేచిపోయొచ్చినట్టు. .వూఁ" వెక్కిళ్ళు పెట్టి ఏడుస్తోంది నీరజ.

నిలువునా ఒక్కసారి కంపించిపోయి రాతిబొమ్మనై పోయేన్నేను.

రత్నం ఎప్పుడొచ్చేడో—"సార్!—మీరా? " అతని కళ్ళలో విస్మయం, అనుమానం, భయం.

ఆ తరువాత రత్నం నన్ను యేమని ప్రాధేయపడ్డాడో, అతని రహస్యాన్ని కాపాడ్డానికి నేనెందుకు మాటిచ్చానో అదంతా ఇప్పుడనవసరం.

కాని, నాకెప్పటికీ తీరని అనుమానం వొకటుంది—

సంఘంలో క్రిందివాడు పైమెట్టెక్కి పైవాడు కావాలంటే—చివరకి అతి పవిత్రమైన ఆలుమగల అనుబంధంకూడా అపహాస్యాల పాలు కావలసిందేనా—అని?! □